



(23 వ భాగము)

'ఛురుక్' మంది సూది దిగంగానే.

మందు లోనికి పోతూంటే, ఒంట్లోంచి ఆవిర్లు క్రమ్ముకొచ్చినట్లయింది.

శరీరం దూదిపింజెలా తేలిగ్గా గాలిలో తేలిపోతూన్నట్లనిపించింది.

మరు నిముషంలో కళ్ళకు మగత ఆవరించింది. మసకలు క్రమ్ముతున్నాయి.

ఎదురుగావున్న డాక్టర్ డేనియల్ గానీ, ఆయన ప్రక్కనే నిల్చున్న నర్స్ గానీ కనుపించలేదు.

కానీ, నా గుండెలనిండా ఆ మెరికన్ నర్స్ రూపం మాత్రం నిండిపోయి వుంది.

ఆమెను నా రెండుచేతులతో పట్టుకొని గొంతు గట్టిగా నులిమి చంపుతున్నట్లు, కత్తితో బలంగా పొట్టలో పొడు

స్తున్నట్లు, రివాల్వరు గురిపెట్టి కణతలు చిట్లిపోయేలా కాల్చినట్లు, కలలాంటి మైకంలో ఊహించుకుంటూ, స్పృహ లేని లోకంలోకి తూలిపోయాను.

ఆ స్థితిలో ఎన్ని నిముషాలు, గంటలు, రోజులు ముందుకు జరిగివుంటాయి. వాటి ఉనికి నాకు ఏమాత్రం తెలీదు.

మళ్ళీ కళ్ళు తెరిచేసరికి తెల్లటి ఎండ, వేడి వెలుతురు కిటికీలోంచి నా గదిలోకి దూరి, దూసుకొచ్చాయి.

ఈమారు సులభంగానే లేచి కూర్చోగలిగాను. అలా చేస్తున్నప్పుడు ఎక్కడా నొప్పిగానీ, బాధగానీ, పుట్ట లేదు.

ఒకక్షణం కూర్చుని, మెల్లగా ఒక్కొక్క కాలే మంచంపైనుండి క్రిందకు జారవేశాను.

ఒళ్ళంతా తేలికగా వుంది. అంతకుముందున్న అస్వస్థత గానీ, అనారోగ్యంగానీ, నీరసంగానీ కనుపించలేదు. చిన్నగా కాళ్ళను నేలపైన ఆనించి, లేచి నుంచున్నాను. గదిలో పచార్లు చేశాను.

చాలారోజుల తర్వాత మామూలు మనిషిలా తయారైనట్లు నాకు నేనే తెలుసుకున్నాను.

"తలుపు నెట్టుకొని లోనికొచ్చిన డాక్టర్ డేనియల్ నావైపు చూసి, "హల్లో! రాజ్! స్పృహ వచ్చిందా నీకు?" అంటూ లోనికొచ్చాడు.

ఆయనకు జవాబు చెప్తున్నట్లు నవ్వాను.

"అలా కూర్చో!" అంటూ మంచం చూపించాడు డేనియల్.

వచ్చి కూర్చున్నాను.

ఐదు నిముషాలకాలం పరీక్ష చేశాడు. అంతా అయ్యాక చేతులు కడుక్కుంటూ "యూ ఆర్ ఓ. కే!" అన్నాడు.

ఆ మాటంటూవుంటే ఆయన కళ్ళు జ్యోతుల్లా వెలిగి పోవటం నేను గమనించాను.

"ఐ ఫీల్ దట్!" అన్నాను కృతజ్ఞతాపూర్వకంగా.

"రెండ్రోజులు మత్తులోంచి లేవకుండా వుండేందుకిచ్చాను మందు. దాని ప్రభావం కనపడుతుంది!" అన్నాడు డేనియల్.

"మీ సేవకు ఉత్తత్తి కృతజ్ఞతలు చెప్పుకోవడం తప్ప, ప్రస్తుత పరిస్థితిలో నేను చెయ్యగలిగిందేమీ కనుపించడం లేదు" అన్నాను.

"డోంట్ బీ సిల్లీ! నువ్వు నాకేం చెయ్యానవసరం లేదు. కష్టపడి నీ ప్రాణాలు నిలబెట్టాను. వాటిని అర్థంలేని మొండితనంతో, వ్యర్థమైన సాహసాలకు పోయి పోగొట్టుకోవద్దు. నిండుగా నూరేళ్ళు జీవించు. చరిత్రలో నీ గురించి, నువ్వు చేసిన మంచి గురించి మానవాళి రాసి, మరీమరీ మననం చేసుకొనే విధంగా నీ నడవడికను తీర్చిదిద్దుకో. అంతకన్నా నాకు ఆనందం కలిగించే కానుక మరేదీ వుండదు!" అన్నాడు డేనియల్.

ఆ మాటలు చెప్తున్నప్పుడు ఆయన కళ్ళల్లో కనుపించిన ఉద్రేకం, బుగ్గలపై కుబికిన ఆవేశం, చూసి అవాక్కాయి పోయాను.

"అలాగే! మీరు చెప్పిన సలహా మరచిపోను డాక్టర్!" ఆయన చేతిలో చెయ్యివేశాను.

డేనియల్ నన్ను బలంగా కౌగలించుకున్నాడు.

మా ఇద్దరిమధ్యా ఏ మాటలూ లేవు.

"నీ కార్యక్రమం ఏమిటి?" అడిగాడు డేనియల్ ఐదు నిముషాల తర్వాత.

డెల్లానుగురించి చెప్పాలా, వద్దా అని ఆలోచించాను.

ఆయనకు నా మనస్సులో వున్న భావాల్ని చెప్పటంలో తప్పు లేదనిపించింది.

"మీ అనుమతిస్తే నే వెళ్ళిపోతాను. ముందు డెల్లాను వెతుకుతాను. మనిషినో, లేకుంటే కనీసం శవాన్నో పట్టుకోగలుగుతాను. ఆ తర్వాత ఏం చెయ్యాలో నిర్ణయించుకుంటాను" అన్నాను.

"గుడ్! కానీ మిస్టర్ రాజ్. మేము ఇన్నాళ్ళుగా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నా అనుమానం ఆమె మనఃస్థిమితం లేని పరిస్థితిలో, సముద్రంలోదూకి చనిపోయి వుంటుందని. ఆమె శవంకూడా అందువల్లే కనుపించలేదు. అందువల్ల నువ్వు ప్రయత్నాలు మానుకుని వేరే దారి చూసుకోవడం మంచిది. నీ కిష్టమయితే విమానంలో అమెరికాకు పంపుతాను. అక్కడే సెటిలయిపోవచ్చు. కాదనుకుంటే మీ దేశం వెళ్తానన్నా నాకేం అభ్యంతరం లేదు. నీపైన ఏ విధమైన కఠినచర్యలు తీసుకోకుండా, ప్రభుత్వాన్ని ఒప్పించగలను. ఆలోచించు!" అన్నాడు డాక్టర్.

ఆయన మాటలకు ఆశ్చర్యపోయాను.

నాకు నా మాతృభూమి గుర్తొచ్చింది. పవిత్రమైన పుణ్యభూమి భారతదేశం. అక్కడ నేను గడిపిన అపవిత్రపు, అవినీతి జీవితం, దాని తాలూకు నేరాలుకూడా కళ్ళముందు సినిమా బొమ్మల్లా కదిలాయి.

బొంబాయి నగరం, అందమైన సముద్రం, తెలిసిన మనుషులు, ప్రదేశాలు, సుందరమైన ప్రకృతి, ఆకాశాన్ని అంటినట్లుండే హార్మ్యాలు అన్నీ గుర్తుకొచ్చాయి. దేనియాల్ కల్పించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందామనిపించింది, తిన్నగా వెళ్ళిపోయి.

కానీ డెల్లా గుర్తొచ్చింది. ఆమెను గాలికి వదిలేసి, నా స్వార్థం నేను చూసుకోవడం, అన్యాయం మాత్రమే కాదు! అధర్మమనికూడా తోచింది మనస్సుకు. ముందామె సంగతి తేలందే, నా భవిష్యత్ పథకాల గురించి ఆలోచించడం తప్పన్న, గట్టి నిర్ణయానికొచ్చాను.

"నీలో జరుగుతున్న ఘర్షణ నాకు తెలుసు. నువ్వు మీ దేశం వెళ్ళడమే మంచిది. ఇన్నాళ్ళూ అనుభవించిన కష్టాలు చాలు. జన్మంతా సరిపోతుంది వాటిని తలచుకొంటూ సుఖపడేందుకు. ఏమంటావ్?" అడిగాడు డేనియల్ నా మనోభావాల్ని పసిగట్టి.

"అది కాదు! డెల్లాను వదలివెళ్ళడం వీలు కాదనిపిస్తుంది!"

"ఆమె ఈ లోకాన్నే విడిచి వెళ్ళిపోయి వుండొచ్చని చెప్పానుగా?"

"అదే నిర్ధారణగా తెలియాలి! నాకు నేనే ఆ విషయం నమ్మకంగా తెలుసుకోవాలి!"

"ఐతే నా మాట విననంటావు?" కాస్త కోపంగా అడిగాడు డేనియల్.

"అలాగనుకోకండి. ఆమెకూ, నాకూ ఉన్న అనుబంధం ఎంత గట్టిదో మీకు తెలీదు. ఒకరికోసం ఒకరం ఎంతెంత సాహసాలు చేశామో, ఎన్నెన్ని ప్రమాదాలు యెదుర్కొన్నామో, గుర్తు వచ్చాక, నా పరిస్థితిలో మీరున్నా, నాలాగే నిర్ణయం చేసుకొనేవాళ్ళు!" అన్నాను.

"దట్స్ ఆల్ రైట్! నేను బహుశా రేపు వెళ్ళిపోతాను. ఆ లోపల నీ మనస్సు మారి, రాదలచుకుంటే, నా వెంట నిన్నుకూడా న్యూయార్కుకు తీసుకెళ్ళగలను. లేదా నీ ఖర్మ!" అన్నాడు లేస్తూ కుర్చీలోంచి.

నేనేం మాట్లాడలేదు. మౌనంగా నిల్చున్నాను.

డేనియల్ గదిలోంచి వెళ్ళిపోయాడు.

ఆయన వెళ్ళాక నాకు నర్సుల విషయం గుర్తొచ్చింది. వాళ్ళిద్దరూ ఆయనతో వెళ్తున్నదీ, లేనిదీ తెలుసుకో నందుకు చింతించాను. డెల్లాకేదన్నా ప్రమాదం జరిగినట్లు ఋజువు ఐన పక్షంలో అమెరికన్ నర్సును చిత్రహింస చేసి చంపాలన్న నిర్ణయం అంతకుముందెప్పుడో తీసు కున్నాను. అది అమలుపరచడం సాధ్యం. అవుతుందా? కాదా? అన్న అనుమానం బయలుదేరింది.

మరుసటిదినం విమానం బయలుదేరే లోగా, నా అన్వే షణ పూర్తి కావాలి! కాని ఇంతపెద్ద దీవిలో ఒక్కడిని ఒక్కరోజులో వెతకలేనేమో ననిపించింది.

ఐనా నిరుత్సాహం కలగలేదు. ప్రయత్నించ దలచు కొన్నాను. వెంటనే బట్టలు మార్చుకున్నాను. బూట్లు తొడుక్కున్నాను. మెల్లగా బైటకొచ్చాను.

బిల్డింగు వెలుపలకొచ్చాక చెట్లనీడలో కుర్చీ వేసుకుని కూర్చుని విస్కీ త్రాగుతున్న అమెరికన్ నర్స్ కనిపిం చింది.

ఆమెవైపు నేను చూడగానే రమ్మని చేత్తో సైగ చేసింది.

దగ్గరకంటూ వెళ్ళాను.

"కూర్చో!" అంది తనకెదురుగా వున్న ఖాళీకుర్చీ చూపించి.

క్షణం సందేహించి, తర్వాత కూలబడ్డాను.

"త్రాగుతావా?" అడిగింది ఆమె.

"స్మాల్ పెగ్!" అన్నాను.

సీసా అందించింది,

తీసుకొని, నోటినిండా పోసుకుని గుటక వేశాను. సీసా తిరిగి ఇచ్చేశాను. ఆ చేదు వాసన, ఆ మత్తూ, రుచి చూసి చాలాదినాలు కావటంవల్ల, కడుపులో త్రిప్పింది.

"ఎక్కడికి బయలుదేరావ్?" అడిగింది నర్సు.

"అలా తిరిగొద్దామని!" అన్నాను.

"అబద్ధాలు చెప్తున్నావ్. నీ ప్రియురాలు డెల్లాను వెతకాలని కదూ నీ తాపత్రయం" తెలిసినట్లు అడిగింది.

"ప్రియురాలు కాదు! ఆమె నా భార్య!" అన్నాను.

"అదే అదే!"

"అవును!"

"ఇంతదాకా డేనియల్ వెతికించాడు. ఆమె కనుపించ లేదు. హెలికాప్టరు వేసుకొని తిరిగారు. ఐనా లాభం లేకపోయింది. ఇంక నీకు ఎలా దొరుకుతుంది?" అడిగిం దామె.

"నాకు ఆమె కనిపించదని అంత ఖచ్చితంగా నీకెలా తెలుసు?" అడిగాను కాస్త సీరియస్‌గా.

"తెలుసని కాదు! ఊహించాను!" అందామె,

నా కామె మాటలు నమ్మ బుద్ధికాలేదు. తన చేతులతో కట్లు విప్పి, వెలుపలికి తీసుకెళ్ళి, ఎక్కడైనా గొంతు పిసికి చంపి, పూడ్చిపెట్టి వుంటుందా అన్న అనుమానం కూడా కలిగింది నాకు. బహుశా ఆమె శవమైనా దొరక్క పోవడానికి కారణం అదే ననిపించింది.

మెదడు వేగంగా పనిచెయ్యసాగింది. గమ్యం తెలీ కుండా దీవినంతా మళ్ళీమళ్ళీ తిరిగినా డెల్లా కనుపిస్తుం దన్న నమ్మకంలేదు. ఈమెను కాస్త మభ్యపెట్టి, మెల్లిగా రహస్యం రాబట్టుదామా అనుకున్నాను. అదే మంచిదని తోచింది.

"డెల్లా, నేనూ వింత పరిస్థితుల్లో, విచిత్రమైన వాతావరణంలో కలుసుకున్నాం. ప్రేమ నేది లేకుండా, శారీరకంగా ఒకటైనాం. ఆ తర్వాత ప్రేమ దానంతటదే పుట్టుకొచ్చింది. ఫలితంగా పెళ్ళి చేసుకున్నాం. ఆమె ఇలా మాయం కావడం నన్ను కొంతవరకు కృంగదీసింది. పోయినవాళ్ళతో తే మనమూ పోవడం మంచిదనిపించింది నిన్నటిదాకా! ఇవాళ దేనియల్ గారు కొన్ని విషయాలు చెప్పారు. మనిషి బ్రతుక్కి వున్న విలువలు క్రొత్త కోణాలనుంచి చూపించారు. అవి చూశాక ఆమె లేకున్నా బ్రతకటం తప్పు లేదనిపిస్తూంది," అన్నాను ఉపోద్ఘాతంలా.

నా మాటలు వింటూ తలెత్తి నా కళ్ళలోకి సూటిగా చూస్తూ డ్రింక్ తీసుకోవడం మొదలెట్టింది అమెరికన్ నర్స్.

"దట్స్ గుడ్!" అంది సీసా ప్రక్కన పెట్టి.

"లక్కీ! నా భావాల్ని నువ్వూ మెచ్చుకుంటున్నావ్!" అన్నాను.

"నీలో ఇలాంటి మార్పే నేను కోరాను!" అందామె.

"ఎందుకు? దానివల్ల నీ కుపయోగ మేమిటి?"

"నీలాంటి తెలివైనవాడు, అందమైన మగాడు, చదువున్న విజ్ఞుడు ఇలా ఎడారుల్లో, అడవుల్లో కాదు వుండవలసింది. నాగరికత, సుఖం, స్వర్గం అందుబాటులో వుండే మా అమెరికాలో."

"అవుననుకో! తోడుండాలిగా! అది లేకుంటే కష్టం' అందులోనూ పరాయిదేశంలో'" అన్నాను.

"ఆ బెంగ పెట్టుకోకు! నేనుంటాను."

"ఐతే నన్ను తీసుకెళ్తావా? అమెరికాకు నీతో...?"

అడిగాను లేని ఆత్రుతను తెచ్చిపెట్టుకొని.

"వస్తానంటే తీసుకెళ్తాను. మేమంతా రేపు వెళ్ళా లనుకుంటున్నాం. నాతో వస్తావా?"

"రాక ఏం చేసేది? ఇక్కడుండి నేను చేసేదిమాత్రం ఏమిటి? డేనియల్ గారుకూడా రమ్మన్నారు!" అన్నాను.

"దెన్ ఇట్ ఈజ్ ఓ. కే." అంది సీసా మళ్ళీ తీసి పెదాలపైన పెట్టి పైకెత్తి వంచుకుంటూ.

ఆనందంలో వుంది గాబోలు, సీసాలో సగంపైగా వున్న ద్రవం మొత్తం గడగడమని త్రాగేసిందామె.

"అలా సముద్రం దగ్గరకు వెళ్దాం! వస్తావా?" అడిగాను నవ్వుతూ.

"ఆఁ!" అంటూ లేవబోయి తూలిపడింది.

నేను వొంగి రెండు చంకల్లో చేతులుపెట్టి పైకెత్తాను. అతి కష్టంమీద ఆమె కాళ్ళపై ఆమెను నిలబెట్టగలిగాను.

త్రాగిన మైకంలో నాలుగడుగులు వేసీ వేయకముందే పడిపోవడం మొదలెట్టింది. అలాగే సముద్రం దగ్గరకు వచ్చాం ఇద్దరం.

ఎదురెదురుగా కూర్చున్నాం.

పైన ఎండ తలలు మాడుస్తున్నా, ఎదురుగా సముద్రం పైనుండీ వస్తున్న గాలి చల్లగా శరీరానికి తగలటంతో కాస్త హాయిగా వుంది.

"అమెరికాలో ఇలాంటి ప్రశాంతమైన వాతావరణం దొరుకుతుందా?" అడిగాను.

"ఎవరికావాలి ఇలాంటి భయంకరమైన ప్రకృతి? దయ్యాలకూ, శవాలకూ తప్ప, మనుషులకు మాత్రం అవసరం వుండదనుకుంటాను. అక్కడి లైఫ్ తలచుకొంటే చాలు! మత్తెక్కిపోతాను" అంది నా వొళ్ళో పడు

కుంటూ.

"ఇప్పుడూ మత్తులోనే వున్నావుగా?" అడిగాను ఆమె త్రాగిన సీసా విషయం గుర్తుచేస్తున్నట్లు.

"అది మనిషినిమాత్రమే మత్తెక్కిస్తుంది. కానీ నువ్వు నా మనసునూ, వయసునూ మత్తెక్కించావ్? నిన్నెలాగైనా నా వాణ్ని చేసుకోవాలనుకున్నాను. నౌ యూ ఆర్ విత్ మీ!" అంది పెనవేసుకుంటూ.

"ఆ మాత్రానికే ఆనందించకు!" అన్నాను, ఆమె పట్టు సడలించుకుంటూ.

"ఎందుకని?"

"ఇంతకు ముందులా లేను నేను" అన్నాను.

"అంటే..." విచిత్రంగా చూసిందామె నాకేసి.

"నాకీ ప్రమాదం జరగకముందు నీలాంటి అందగత్తెలను చూడగానే శరీరం ఉద్రేకంతో ఊగిపోయేది. రక్తం వేడెక్కేది. నరాలు కోరికలు నింపుకొని పాముపడగల్లా నాట్యం చేసేవి. ఇప్పుడెందుకనో శరీరం చల్లబడిపోతున్నట్లు, చైతన్యం నశిస్తున్నట్లుగా వుంటుంది" అన్నాను.

ఆమె కళ్ళల్లో అందాకా మిలమిల మెరిసిన మెరుపులు మాయమైనాయి. నా వంక సూటిగా చూస్తూ, "యూ ఆర్ నాట్ పొటెంట్?" అంది.

"అదే తేలడంలేదు! నువ్వు నర్సువి. నాకన్నా నీకెక్కువ తెలియాలి! అలా జరిగే అవకాశం వుందా?"

"ఉందనే అన్నాడు డేనయల్! అలా జరిగిన కేసులు రెండు మూడు విన్నానుకూడా! అయితే నా ప్రయత్నమంతా వేస్ట్!" అంది.

—(సశేషం)